వసూళ్లు ఫుల్.. సౌకర్యాలు నిల్!

మోడ్రన్ కల్యాణ మండప నిర్వహణ గాలికి!


ఫంక్షన్‌హాలు ముందు పార్కింగ్..


విరిగిపడిన చెట్టు కొమ్మ


వాష్‌బేసిన్ వద్ద నల్లాలు లేకుండా..


ప్రమాదకరంగా విద్యుత్తు కనెక్షన్ బాక్స్

చింతల్: 'వసూళ్లు ఫుల్.. సౌకర్యాలు నిల్' అన్న చందంగా తయారయ్యింది. భగత్‌సింగ్‌నగర్‌లోని మోడ్రన్ కల్యాణ మండపం దుస్థితి. ఈ కల్యాణ మండపంలో జరిగే ప్రతి శుభకార్యానికి కిరాయిలు చెల్లించుకుంటున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలేశారని స్థానికులు, కల్యాణ మండపం బుకింగ్ చేయడానికి వచ్చే వారు ఆరోపిస్తున్నారు. దావత్‌లు జరిగిన ప్రతిసారి వాటి ద్వారా వచ్చే వ్యర్థాలను రోజుల తరబడి కల్యాణ మండపంలోని వదిలేయడంతో దుర్గంధం నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు. ఒక ఫంక్షన్ పూర్తయిన తర్వాత మరో ఫంక్షన్ నిర్వహించే వరకు కల్యాణ మండపం వైపు అధికారులు కన్నేతి చూడడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

ప్రకటనలకే పరిమితమైన ఎమ్మెల్యే హామీ...

భగత్‌సింగ్‌నగర్ కమ్యూనిటీ, ఫంక్షన్‌హాల్‌లో మౌలిక వసతుల కల్పన కోసం గత ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ మరోసారి పోటీ చేసే సందర్భంగా ఫంక్షన్ హాల్‌కు వెయ్యి కుర్చీలు, 20 సోఫాలను తన సొంత నిధులతో కొనుగోలు చేస్తానని హామీ ఇచ్చారు. కానీ ఒక కుర్చీ కూడా కేటాయించలేదని భగత్‌సింగ్‌నగర్ వాసులు ఆరోపిస్తున్నారు. వెయ్యి కుర్చీల హామీ సోఫా సెట్ల హామీ ఎన్నికల స్టంట్‌గా మారిపోయిందని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తాలేని వాష్ బేసిన్స్..

ఈ మోడ్రన్ ఫంక్షన్‌హాలులో ఉన్న నీటి కుళాయిల పరిస్థితి అధ్వానంగా మారింది. వాష్ బేసిన్స్ వద్ద పది నల్లాలు ఏర్పాటు చేయగా వాటిని కొంత మంది దుండగులు ఎత్తుకుపోయారు. మరలా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉండగా వాటిని గాలికొదిలేశారు. దీంతో ఫంక్షన్‌హాల్ పైన ఉన్న వాటర్‌ట్యాంక్ ఖాళీ అయ్యే వరకు నీరు వృథాగా పోతూనే ఉంది. అంతేకాకుండా వాటర్‌ట్యాంక్‌కు ఆటోమెటిక్ స్విచ్ కంట్రోల్ లేకపోవడంతో నీరు వెనుకవైపు గల్లీలో ఏరులై పారుతోంది.

పడకేసిన పారిశుద్ధ్యం....

ఫంక్షన్ హాల్ బుకింగ్ కోసం పైకము చెల్లించుకొని రసీదు ఇస్తున్న అధికారులు పారిశుద్ధ్యాన్ని గాలికి వదిలేశారు. ఒకరోజు ఫంక్షన్ అయితే వాటి ద్వారా వచ్చే చెత్త మురుగు వేరుగాలు మరల ఫంక్షన్ వచ్చేవరకు ఫంక్షన్‌హాల్ బయట ఉంటుందన్నారు. చెత్తను తీసుకెళ్లేందుకు పారిశుద్ధ్య సిబ్బంది రాగా ఫంక్షన్ నాలుగు తాళం వేసి ఉండడంతో వారు వెనుక తిరుగుతున్నారని దీంతో చుట్టుపక్కల ఉండేవారికి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తెలంగాణ సంస్కృతికి దర్పణం.. బోనాల ఉత్సవం


కొలను శ్రీనివాస్‌రెడ్డితో రాజీవ్‌గృహకల్ప నల్లపోచమ్మ, శివాలయం కమిటీ సభ్యులు

నిజాంపేట: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు దర్పణంగా నిలిచే బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొలను శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బోనాల ఉత్సవాల నిర్వహణపై నిజాంపేట రాజీవ్ గృహకల్పలోని నల్లపోచమ్మ, శివాలయం కమిటీ సభ్యులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, జనరల్ సెక్రటరీ కుమార్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ వరికుప్పల దశరథ్, ట్రెజరర్ వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీవీ రమణ, భిక్షపతి, రామోజీ, బాలకృష్ణ, సుమతిరెడ్డి, సరితారెడ్డి, ఉష, రాణి తదితరులు పాల్గొన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..**

నిజాంపేట 12వ డివిజన్ బాలాజీహిల్స్ నివాసితులు ఆదివారం కొలను శ్రీనివాస్‌రెడ్డిని కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారించేలా చూస్తానని చెప్పారు. ఈ సందర్భంగా కాలనీ నివాసితులు ఆయనను శాలువాతో సత్కరించారు.

వైభవం.. రేణుకాఎల్లమ్మ కల్యాణం







జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వైష్ణవి ఎంక్లేవ్‌లో ఆదివారం రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి బోనాలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగేళ్ల క్రితం కాలనీలో వెలిసిన రేణుకాఎల్లమ్మకు ప్రతి సంవత్సరం పూజలు చేస్తూ వస్తున్నారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్

బీసీ వ్యక్తికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీలో అర్హులైన బీసీ వ్యక్తికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. కొంపల్లిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నియమించబోయే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం పదవులకు అవకాశం కల్పించాలని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పదవులలో బీసీలు లేరు కనుక పీసీసీ అధ్యక్ష పదవి బీసీలకే కేటాయించాలని ఆరే మహేందర్ అన్నారు. ఈ సందర్భంగా జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్‌రావుతో పాటు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలకు వినతి పత్రం పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కోఆర్డినేటర్ దశరథం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మేడవరపు రాజేష్ కుమార్ ప్రధాన కార్యదర్శి రంగు క్రాంతి గౌడ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు నిఖిల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దాద అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

కుత్బుల్లాపూర్ : ప్రజల సమస్యలను పరిష్కరించడానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్‌లోని ఆయన నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ.వివేకానందను కలిసి పలు వినతులు సమర్పించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. త్వరలోనే పెండింగ్ పనులను పూర్తిచేసుకోవడంతో పాటు నూతన పనులకు శంకుస్థాపన చేస్తానని హామీ ఇచ్చారు.

◆ సీసీరోడ్డు పనులను చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యేకు రాజీవ్ గాంధీనగర్ వాసులు వినతిపత్రం అందజేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి సుజాత ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీనగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద కలిసి మోడ్రన్ టాయిలెట్ల నుంచి సాయిబాబా దేవాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, అంగన్‌వాడీ సెంటర్‌లో అదనపు తరగతి గది, క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు.

ఇందిరమ్మ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

నిజాంపేట్: ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు నిజాంపేట మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్–3లో సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మేయర్ నీలారెడ్డి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ ఫేజ్–3, ఫేజ్–2 నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిజాంపేట్: నిజాంపేట్ 12 డివిజన్‌లోని బాలాజీహిల్స్‌కు చెందిన కాలనీవాసులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి తమ కాలనీలో ఉన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అన్నదానం

జగద్గిరిగుట్ట: పదిమందికి అన్నం పెట్టడమే ప్రధాన లక్ష్యంగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించామని శ్రీ హనుమాన్ అన్నప్రసాద సేవాట్రస్ట్ చైర్మన్ కన్నేకంటి లక్ష్మణ్, అధ్యక్షులు కళ్యాణ్‌రావు పాటిల్ తెలిపారు. చింతల్ శ్రీ సాయికాలనీలోని అభయాంజనేయ, పోచమ్మ అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం నేటికి 60 వారాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సొంత ఖర్చుతో మొదలుపెట్టిన ఈ అన్నదాన కార్యక్రమం నేడు అనేకమంది భక్తులు విరాళాలిస్తూ.. ప్రోత్సహిస్తున్నారని చైర్మన్, అధ్యక్షులు తెలిపారు. స్థల దాత, పండరి తమకు ముందుండి నడిపిస్తున్నారని, అందరి సహకారంతో ప్రతీవారం ఈ అన్నదాన కార్యక్రమం కొనసాగించడానికి ప్రయత్నిస్తామన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలోని 23వ వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును కౌన్సిలర్లు మాదాసు వెంకటేశం, శంభీపూర్ కృష్ణలు ప్రారంభించారు. అనంతరం వార్డులోని వివిధ ప్రాంతాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కౌన్సిలర్ శంకర్‌నాయక్, సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు బాలకృష్ణ, నరసింహ, ఫాసి ఉద్దీన్, రాజుగౌడ్, ఉస్మాన్, విఠల్, మహేష్, సందీప్, శ్రీనివాస్ తదితరులున్నారు.

అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావుకు సేవా పురస్కారం

కుత్బుల్లాపూర్: అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన నాగేశ్వరరావుకు సేవా పురస్కారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో అల్వాల్ ట్రాఫిక్ ఏరియాలో సుచిత్ర, దూలపల్లి, కొంపల్లి, గుండ్ల పోచంపల్లి తోపాటు రాజీవ్ రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడమే కాకుండా పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చేశారు. ముఖ్యంగా ఫ్రీ లెఫ్ట్ విషయంలో విజయవంతం కావడంతో ట్రాఫిక్ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టినట్లు అయ్యింది. ఇలా అనేక ప్రధాన రోడ్లపై తోపుడు బండ్లు ఇతర వ్యాపారాలు కొనసాగించే వారితో చర్చలు జరిపి వాటిని తొలగింపజేశారు. ఇలా అనేక ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నాగేశ్వరరావుకు సేవా పురస్కారంతో గౌరవించనుంది.

కోటిరెడ్డికి 'ఉగాది కీర్తిరత్న' అవార్డు

కుత్బుల్లాపూర్: టీవీఆర్ విద్యా సంస్థల చైర్మన్ కోటిరెడ్డికి 'ఉగాది కీర్తిరత్న'అవార్డు లభించింది. ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చర్ అసోసియేషన్ (ఎఫ్ఎన్‌సిఏ) ఆయనను అవార్డును ప్రదానం చేసింది. విద్యా సంస్థలను నెలకొల్పి విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కాగా మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరిగిన కార్యక్రమంలో కోటిరెడ్డికి అవార్డును అందజేశారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా అధ్యక్షుడు డాక్టర్ వెంగట ప్రతాప్, నేషనల్ ఉమెన్ చీఫ్ డాక్టర్ కౌసల్య జువాల్, ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ జానకి రామ వరప్రసాద్ చేతుల మీదుగా కోటిరెడ్డి అవార్డును అందుకున్నారు.

జలమండలి అధికారి ఉద్యోగ విరమణ



చింతల్: జలమండలి రెవెన్యూ సీజీఎంగా, కుత్బుల్లాపూర్ అదనపు జీఎంగా పనిచేస్తున్న మందా శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. 2019లో అల్వాల్ నుంచి కుత్బుల్లాపూర్‌కు వచ్చిన ఆయనకు తాగు నీటి సమస్యలే స్వాగతం పలికాయి. 2019 నుంచి నేటి వరకు అనేక బస్తీలు, కాలనీలలో తాగునీటి పైపులైన్‌లతో పాటు భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌లను విస్తరించారు. 2022–23 కుత్బుల్లాపూర్‌లో వివిధ పరిమాణాలలో సుమారు 86 కిలోమీటర్ల మేర తాగునీటి పైపులైన్‌లు వేశారు. అందులో 70 కిలోమీటర్ల మేర ఓఆర్‌ఆర్ పరిధిలో విస్తరించారు.

◆ 2024 నుంచి ఇప్పటి వరకు మరో 30 కిలోమీటర్ల మేర నూతన తాగునీటి పైపులైన్‌లు వేయడా మరో 60 కిలోమీటరల వరకు అంచనాలు రూపొందించి సిద్ధం చేశారు. అంతేకాకుండా 2023లో కుత్బుల్లాపూర్‌లో 80 కిలోమీటర్ల మేర భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వేయగా మరో 70 కిలోమీటర్ల మేర ఓఆర్‌ఆర్ పరిధిలో విస్తరించారు. 2024లో నేటి వరకు మరో 30 కిలో మీటర్ల పైపులైన్ వేయగా మరో 40 కిలోమీటర్ల వరకు అంచనాలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

నూతన జీఎం రాకపై ఉత్కంఠ..

కుత్బుల్లాపూర్ జీఎంగా శ్రీధర్‌రెడ్డి వచ్చిన సమయంలో ఆయా సెక్షన్ మేనేజర్లుగా వచ్చిన వారంతా కొత్తవారే. కానీ అన్నీ తానై నూతనంగా వెలుస్తున్న, బస్తీలు, కాలనీలలో సమస్యలను తీర్చిన శ్రీధర్‌రెడ్డి సీజీఎంగా పదోన్నతి పొందినప్పటికీ అదనపు జీఎంగా ఇక్కడే కొనసాగారు. ఆదివారం శ్రీధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో నూతనంగా వచ్చే జీఎంపై ఉత్కంఠ నెలకొంది.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సత్కరిస్తున్న ప్రజలు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ సంక్షేమ సంఘాల నేతలు పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ప్రారంభం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూమ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు సూచిక బోర్డులను ఆదివారం ప్రారంభించారు. డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ యువజన నాయకులు కొలుకుల జైహింద్ మాట్లాడుతూ.. సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం వల్ల ప్రతి ఒక్కరికీ ఇంటి అడ్రస్ తెలుసుకోవడం సులభతరం అవుతుందన్నారు. ముఖ్యంగా అంబులెన్స్ లాంటి ఎమర్జెన్సీ సర్వీసులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ తదితర సర్వీసులకు ఆ సూచిక బోర్డులు చాలా ఉపయోగపడతాయన్నారు. మగ్దూమ్‌నగర్ కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్, మాజీ వార్డు మెంబర్ మహమూద్, శంకర్, రాజేష్, వినోద్‌కుమార్, సత్యరాజు, సత్తిరెడ్డి, శ్రీనివాస్, ప్రభు, భాస్కర్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సూచిక బోర్డులను ప్రారంభించిస్తున్నకొలుకుల జైహింద్

ఓర్వలేకే తప్పుడు ప్రచారం

దుండిగల్: తన రాజకీయ ఎదుగులను ఓర్వలేక కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ కొత్ర శంకర్ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. గాగిల్లాపూర్ తాండాలో తమ కుటుంబం 50 ఏళ్లుగా నివసిస్తున్నామని, తమ తండ్రి ద్వారా సంక్రమించిన భూముల్లో ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో పూర్వం ఉన్న ఇళ్లు దెబ్బతినడంతో నూతనంగా ఇంటిని నిర్మించామన్నారు. కొందరు వ్యక్తులు తమ స్థలం వారిదని చెప్తూ.. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉంటున్న తమ స్థలంలోకి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి ట్యాక్సులను సైతం చెల్లిస్తున్నామని వివరించారు. ఈ విషయంపై న్యాయపరంగా పోరాటం చేస్తామని, తనపై ఆరోపణలు చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని శంకర్‌నాయక్ స్పష్టం చేశారు.

క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి



కుత్బుల్లాపూర్: క్వారీ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్య బస్తీకు చెందిన గాదే సత్యనారాయణ (58) వృత్తి రీత్యా మేస్త్రి పని చేస్తుంటాడు. ఇతనికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కొంత కాలంగా భార్యను వదిలేసి బాలయ్య బస్తీ లో ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. సత్యనారాయణ నిత్యం కాలకృత్యాలు తీర్చుకోవడానికి దగ్గరలోని క్వారీ గుంతకు వెళుతుంటాడని, గత 3 రోజులుగా కనిపించలేదని స్థానికులు తెలిపారు. కాగా ఆదివారం క్వారీలో సత్యనారాయణ మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మద్యం అలవాటు ఎక్కువగా ఉండేదని.. అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేవని కుమారుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడి చనిపోయి 3 రోజులు అయి ఉండొచ్చని పోలీసులు తెలిపారు. ఈ విషయమై దర్యాప్తు చేపట్టారు.